క్లుప్తంగా

నుస్తులాపూర్‌లో బీఆర్‌ఎస్ యూత్ సమావేశం



మాట్లాడుతున్న గెల్లు శ్రీనివాస్

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, తాజా మాజీ సర్పంచ్ రావుల రమేశ్ నివాసంలో శుక్రవారం బీఆర్‌ఎస్ యూత్ సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని, ఇందుకు యువ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గతంలో బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్ చేసిన పనులు, తీసుకువచ్చిన నిధులు ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే నియోజవర్గంతోపాటు రాష్ట్రానికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సిద్ధం వేణు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పింగిలి రమేశ్

ఇల్లందకుంట: హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన గొస్కుల శ్రీనివాస్‌ను కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిలి రమేశ్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహసభ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి జివ్వాజీ కుమారస్వామి, ముదిరాజ్ యువ నియోజకవర్గ నాయకుడు చిరంజీవి, పిల్లి తిరుపతి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేస్తున్న సీఐ రవి

జమ్మికుంట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని వీణవంక రోడ్డు కాకతీయ పాఠశాల సమీపంలో టౌన్ సీఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. డ్రంకెన్‌డ్రైవ్, ట్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్ లేని, అనుమానాస్పద వాహనాలను గుర్తించారు. వాహనాలు నడుపుతున్న మైనర్లలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసులు, కేంద్ర బలగాల జవాన్లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీణవంక: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు. మామిడాలపల్లి గ్రామం మానేరు వాగు నుంచి రెండు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి కాగితాలు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వీణవంక: మండలంలోని మామిడాలపెల్లి గ్రామంలో శుక్రవారం పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నగదు స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు. గ్రామంలోని ఓ వ్యక్తి ఇంట్లో కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

నియామకం



నియామకపత్రం అందిస్తున్న రోళ్ల సతీశ్

గన్నేరువరం: మున్నూరుకాపు యూత్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మైలారం గ్రామానికి చెందిన పురంశెట్టి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఖాసీంపేటకు చెందిన గంప మహేశ్ నియామకమయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు రోళ్ల సతీశ్ ఉత్తర్వులు జారీ చేసి నియామకపత్రాలు అందజేశారు. మున్నూరుకాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తామని, నియామకానికి సహకరించిన సంఘం నాయకులు కొనగాల మహేశ్, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, కన్వీనర్ చింతపండు మహేందర్, జిల్లా అధ్యక్షుడు రోళ్ల సతీష్, పురంశెట్టి బాలయ్య, గంప వెంకన్నకు రమేశ్, మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే

హుజూరాబాద్: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను ఘనంగా జరుపుకున్నారు. సిలువ ధ్యానంలో పాల్గొన్నారు, బైబిల్ వాక్యాలు చదివారు, పాటలు పాడారు, ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్ చర్చి రేవ చంద్రపల్కల సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో వందలాది క్రిస్టియన్లు పాల్గొన్నారు. చర్చి కార్యదర్శి సొల్లు బాబు, కోశాధికారి అమర్లపుడి ప్రియాంక శరణ్, సొల్లు సునీత, ఎ.రవీందర్,శ్రీలత, సబిత ప్రతాప్, శోభ జాన్సన్, జ్యోతి, భావన, రాణి, నీలమ్మ, శైలజ, కనకలక్ష్మి, సురేఖ, పుష్పలత, ప్రభావతి, సంపత్, రవికుమార్ పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని హోలీషాలోం చర్చిలో బిషప్ గుండేటి శాంతికుమార్ దైవజనులకు సందేశం అందించారు. ప్రజలు సహనం, ప్రేమ, క్షమాగుణం, శాంతిసమాధానంతో జీవించాలని కోరారు. పాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హుజురాబాద్‌రూరల్: ద్వేషాన్ని ప్రేమతో జయించగలమని, ప్రతి మనిషి సన్మార్గంలో నడవాలని క్రీస్తు సందేశమిచ్చారని మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ ఎస్.జెకార్య అన్నారు. మండలంలోని చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తోకలపల్లి యెహోవా నిస్సీ పరిశుద్ధ ప్రార్థణ చర్చిలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. పాస్టర్ జకార్య శిలువను ధరించి ర్యాలీ నిర్వహించారు. క్రీస్తు త్యాగాలను స్మరించుకున్నారు. సర్వజనుల కోసం ఏసు శిలువనెక్కడ, జీసస్ వాక్యాలను మననం చేసుకోవడం, క్రీస్తు ఆత్మత్యాగానికి గుర్తుగా గుడ్‌ఫ్రైడే జరుపుకుంటారని తెలిపారు. ఉపవాసాలు, ప్రార్థనలతో గడిపిన క్రైస్తవులు క్రీస్తు శిలువనెక్కిన రోజును పవిత్రంగా భావిస్తారని అన్నారు. ఆయా చర్చిల్లో మత గురువులు జీసస్ బోధనలు, సందేశాలు వినిపించారు.సత్యం, క్షమాపణ, ప్రేమ, త్యాగం,అహింస,పరస్పరాభిమానాలు, శాంతి,సౌభ్రాతృత్వాలతో ప్రజలు మెలగాలని మతపెద్దలు సూచించారు. మండలంలోని రంగాపూర్‌లో పాదర్ డాక్టర్ నిల్సన్, దమ్మక్కపేటలో కె. దేవదాసు, ధర్మరాజుపల్లి, కనుకులగిద్దెలలో కె. రాజు, ఇప్పలనర్సింగాపూర్‌లో ఉదయ్‌కుమార్, జూపాకలో ఈ. డేవిడ్, కాట్రపల్లి, కొత్తపల్లిలోలో ఎస్. తిమోతి, పెద్దపాపయ్యపల్లిలో జాషువా బాలస్వామి, పోతిరెడ్డిపేటలో ప్రమోద్, సింగాపూర్‌లో సి.హెచ్.అశోక్, తుమ్మనపల్లిలో జాసఫ్,వెంకట్రామ్‌పల్లిలో ప్రసన్నరావు ప్రార్థనలు చేశారు.



హుజూరాబాద్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



జమ్మికుంట పట్టణంలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైసవులు

జమ్మికుంట: పట్టణంలోని మారుతీనగర్ గెత్సామనే ప్రార్థన మందిరంలో కరుణపురం పాస్టర్ జోజి ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు. సమస్త మానవాళి కోసం ఏసుక్రీస్తు తన ప్రాణాలు పణంగా పెట్టారని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటాలను పాస్టర్ బోధించారు. ఉపవాసం, కీర్తనలు పాడుతూ, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘం పెద్దలు ఇల్లందుల భద్రయ్య, వరికొప్పుల కొండయ్య, రామనాథం, సారయ్య, సతీశ్, రమేశ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని రామడుగు, గుండి, గోపాల్‌రావుపేట, తిర్మలాపూర్, దేశరాజ్‌పల్లి, వెలిచాల, కోరటపల్లి గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు.

తిమ్మాపూర్: మండల వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎల్ఎండీ కాలనీలోని సీఎస్ఐ ఆల్ సెయింట్ చర్చిలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు క్రీస్తు మరణాన్ని గుర్తుచేసుకుంటూ, క్రీస్తు శివులపై మాట్లాడిన మాటలను ధ్యానిస్తూ ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టరేట్ రెడ్డిమల్ల ప్రసాద్ మాట్లాడుతూ.. రెండు వేల సంవత్సరాల క్రితం నరావతారిగా లోకానికి విచ్చేసిన ఏసుక్రీస్తు మానవాళి పట్ల చూపించిన ప్రేమ ఎంతో గొప్పదన్నారు. విశ్వమానవాళి శ్రేయస్సు కోసం క్రీస్తు ప్రాణత్యాగం చేశాడని అన్నారు. ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించారు. ప్రార్థనల అనంతరం క్రైస్తవులకు చల్లనీపానీయం అందించారు. కార్యక్రమంలో చర్చి పెద్దలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రై స్తవులు పాల్గొన్నారు.



చొప్పదండి: హోలీషాలోమ్ చర్చిలో బిషప్ సందేశం



రామడుగు బెరాకా చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



తిమ్మాపూర్: సీఎస్ఐ ఆల్ సెయింట్ చర్చిలో ప్రసాద్

క్రీడలు సద్వినియోగం చేసుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న ముస్కు ఉపేందర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి

గన్నేరువరం: యువత క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గునుకుల కొండాపూర్‌లో ఉమ్మడి బెజ్జంకి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. గ్రామ స్థాయిలో రాణించి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలన్నారు. రాష్ట్రంలో యువతకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పోటీల్లో గెలిచిన జట్టుకు రూ.12 వేలు ముస్కు ఉపేందర్‌రెడ్డి, రన్నర్ జట్టుకు డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి రూ.6 వేల నగదుతో పాటు బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, మానకొండూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రవికుమార్, తిరుపతిరెడ్డి, రాజుగౌడ్, లింగంపల్లి హరీశ్, రాకేశ్, అజయ్, మహేశ్, అరవింద్, క్రాంతి, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కోతల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు

మానకొండూర్‌రూరల్: కోతల్లేకుండా యాసంగి ధాన్యం కొనుగోలు చేస్తామని ఊటూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముద్దసాని ప్రదీప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంఘం వార్షిక సమావేశంలో మాట్లాడారు. సంఘండైరెక్టర్లు ఎంసీ మీటింగ్‌లో సీడ్స్, ఎరువులు, ఓవర్‌డ్యూస్ రుణాల వివరాలపై సమాచారం ఇవ్వాలని కోరితే ఎనిమిది మంది డైరెక్టర్లు సభావేదికపై కూర్చోకుండా బాయ్‌కట్ చేశారు. అనంతరం సీఈఓ రవీందర్ గతేడాది సంఘం ఆర్థిక లావాదేవీలు, ఆస్తి అప్పులు, ఆదాయవ్యయాలను చదివి వినిపించారు. చైర్మన్ మాట్లాడుతూ ఏప్రిల్‌లో సంఘం ఆధ్వర్యంలో డీజిల్, పెట్రోల్ బంక్‌లను ప్రారంభిస్తామన్నారు. సీడ్‌ప్లాంట్ ఓవర్‌డ్యూ డబ్బుల విషయమై డైరెక్టర్లు ప్రశ్నలు అడగ్గా యాజమాన్యాలపై కేసులు పెట్టామని త్వరలో రికవరీ అవుతాయన్నారు. రైతులు సకాలంలో తీసుకున్న రుణాలను చెల్లించాలని లేదంటే వడ్డీ పెరుగుతుందన్నారు. సంఘం ఆధ్వర్యంలో గోదాం, రైస్‌మిల్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడానికి నాబార్డ్ బ్యాంక్ సిద్ధంగా ఉందని త్వరలోనే రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రాష్ట్రంలో ఊటూర్ సొసైటీ సంఘం టాప్ టెన్‌లో ఉందని, రాబోయే రోజుల్లో అధిక లాభాలతో ముందుకు వెళ్తామన్నారు. ఈకార్యక్రమంలో వైస్‌చైర్మన్ ఎడ్ల సతీశ్‌కుమార్, డైరెక్టర్లు మల్లయ్య, నర్సింహారెడ్డి, శాంతలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ ప్రదీప్‌రెడ్డి

మట్టి కుండ.. సల్లగుండ



రాజస్థాన్ కుండలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

- ఫ్రిడ్జ్‌లు వచ్చినా తగ్గని ఆదరణ
- కుండ నీరు ఆరోగ్యమన్న అభిప్రాయం
- కొనుగోలు చేస్తున్న వినియోగదారులు
- వేసవిలో ఊపందుకున్న విక్రయాలు

విద్యానగర్: వేసవిలో మట్టి కుండ చల్లని నీరందిస్తూ దాహార్తి తీరుస్తుంది. కాలక్రమంలో దీని వినియోగం నామోషీగా మారి, ఫ్రిడ్జ్ రాజ్యమేలుతోంది. అయినా, మట్టి కుండ తన ఉనికి కోల్పోలేదు. ఆరోగ్యానికి ఉపయోగమని భావిస్తున్న చాలామంది వినియోగిస్తున్నారు. ఏటా వేసవిలో కుండల విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ట్యాప్‌లతో కూడిన రాజస్థాన్ కుండలు, మట్టి వాటర్ బాటిల్స్, రంజన్‌లపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండటంతో కొంటున్నారు. కుండల విక్రయాలు పెరిగాయని తయారీదారులు, అమ్మకందారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లాలోని కుమ్మరులు తయారు చేసిన కుండలు



మట్టి వాటర్ బాటిళ్లు

నేడు ఎంపీపీపై అవిశ్వాస తీర్మాన సమావేశం

రామడుగు: మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగేటి కవితపై ఎంపీటీసీలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం పై శనివారం సాయంత్రం ఎంపీడీవో సమావేశహాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో రాజేశ్వరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు వన్నారం ఎంపీటీసీ జవ్వాజీ హరీశ్‌కు మద్దతుగా క్యాంపునకు వెళ్లినట్లు సమాచారం.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

గంగాధర: బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు మ్యాక వినోద్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటనలో తెలిపాడు. పనిచేసే వారికి గుర్తింపు లేకపోవడం కారణంగా పదవి, పార్టీకి రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నాడు.

ఎల్‌ఎండీ నుంచి సాగునీరు విడుదల చేయాలి

హుజూరాబాద్: ఏప్రిల్15 వరకు హుజూరాబాద్ నియోజకవర్గానికి ఎల్‌ఎండీ నుంచి సాగునీరు విడుదల చేయకుంటే రైతులతో ధర్నా నిర్వహిస్తామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి కొండాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూరాబాద్‌లో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో కనిపించిన జలదృశ్యాలు కాంగ్రెస్ పాలనలో కనుమరుగయ్యాయని, మండుటెండల్లో అలుగుపారిన చెరువులు మార్చిలోనే ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల నుంచి నీళ్లు వదలాల్సిన ప్రజాప్రతినిధులు ముఖం చాటేయడంతో కాలువలన్నీ బోసిపోయాయని, నిరుడులాగే సాగునీరు వస్తుంది, పుట్లకొద్ది ధాన్యం పండుతుందనుకున్న రైతులు పుట్టెడు దుఃఖంలో ఉన్నారని, సాగునీరు వస్తదని ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగిలిందన్నారు. చేతికొచ్చిన పంటలు కళ్ల ముందే ఎండుతుంటే రైతులు బోరున విలపిస్తున్నారని అన్నారు.

నీరు విడుదల చేయాలని రాస్తారోకో

గంగాధర: వరదకాలువకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు రైతులతో కలిసి శుక్రవారం కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి కురిక్యాల శివారులోని వరదకాలువ వంతెనపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాస్తారోకోలో నాయకులు శ్రావణ్‌కుమార్, అశోక్, రవీందర్‌రెడ్డి, శ్రవన్‌కుమార్‌రెడ్డి, దూళం కళ్యాణ్, చంద్రశేఖర్,వినయసాగర్, సంపత్, సుద్దాల రవీందర్‌రెడ్డి, పెంచాల రాములు, ప్రశాంత్, రేండ్ల శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

జగిత్యాల ఎమ్మెల్యే తండ్రి మృతికి 'పొన్నం' సంతాపం

కరీంనగర్ కార్పొరేషన్: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తండ్రి హన్మంతరావు మృతి చెందగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



రామడుగు: మండలంలోని వెదిర జిల్లా పరిషత్ పాఠశాల 1991–92 పదో తరగతి విద్యార్థులు శుక్రవారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 33 ఏళ్ల తర్వాత ఒకచోట చేరి ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకుంటూ చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. . చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంటూ సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ఈసందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజమౌళి, రిటైర్డ్ పీఈటీ దొడ్డ లచ్చిరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శైలజ, భారతి పాల్గొన్నారు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం విద్యా విషయక ప్రదర్శన, పోషకుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త డాక్టర్ చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు సంస్కారంతో కూడిన విద్యా శ్రీసరస్వతి శిశు మందిరాల్లో లభిస్తుందన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు తెలియజేసే బాధ్యత ఆచార్యులు, తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల సూర్య నమస్కారాలు, యోగ, కోలాటం, చిడుతల భజన, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ ఉడుగుల సురేశ్, డాక్టర్ కన్నెబోయిన తిరుపతి, పాఠశాల సమితి ప్రబంధకరిణి అధ్యక్షుడు అవాల రాజిరెడ్డి, కార్యదర్శి శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, దాసరి రవీందర్, గుండా తిరుపతయ్య, బాదం రమేశ్, రావికంటి నీలకంఠం, బుర్ర శివయ్య, దొంతుల రాజకుమార గర్రెపల్లి నిరుపరాణి, ఆవాసం ప్రధాన చార్యులు పొల్సాని సుధాకర్‌రావు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న చిన్నారులు

బీజేపీ సూక్ష్మ విరాళ ప్రచారం ప్రారంభం



ప్రచారాన్ని ప్రారంభిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు

కరీంనగర్‌టౌన్: బీజేపీ సూక్ష్మ విరాళ ప్రచారాన్ని కరీంనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు శుక్రవారం ప్రారంభించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా జాతీయ నాయకత్వం ప్రత్యేక సూక్ష్మ విరాళ ప్రచారం ప్రారంభించిందని, పార్టీ బలోపేతానికి దోహదపడుతుందన్నారు. నమో యాప్‌లోని డొనేషన్ మాడ్యూల్ ద్వారా విరాళాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులు, దాతలు రూ.5, రూ.50, రూ.100, రూ.500, రూ.1,000 అనే ఆప్షన్‌లను ఎంచుకోవచ్చన్నారు. ప్రపంచంలోనే అత్యధిక మంది కార్యకర్తలను కలిగిన ఏకైక పార్టీ బీజేపీ అని, ఈ సూక్ష్మ విరాళ ప్రచారం ద్వారా కార్యకర్తలు మిలియన్ల మందితో కనెక్ట్ అవుతారని, ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ప్రఫుల్, పురం హరి, కొలగాని శ్రీనివాస్, హరిప్రసాద్, నరేందర్, రవీందర్, గుంజేటి శివకుమార్, తోట అనిల్, సుధాకర్, చింతల శ్రీనివాస్ రెడ్డి, చిట్టిబాబు, స్వామి పాల్గొన్నారు.

వొడితెల ప్రణవ్‌కు టోపీ బహూకరణ

హుజురాబాద్‌రూరల్: వేసవిలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు కాంగ్రెస్ వీరాభిమాని సాదుల రాంబాబు ప్రత్యేక సోలార్ ఫ్యాన్‌తో ఇమిడి ఉండే టోపీని దుబాయ్ నుంచి తెప్పించి కాంగ్రెస్ నాయకుడు వొడితెల ప్రణవ్‌కు శుక్రవారం బహూకరించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోలార్ ఫ్యాన్ టోపీని అందజేసేందుకు అవకాశం కల్పించాలని ప్రణవ్‌ను కోరారు. వెంటనే స్పందించిన ప్రణవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ తీసుకుంటానని హామీ ఇచ్చారని రాంబాబు తెలిపాడు.



ప్రణవ్‌కు టోపీ అందిస్తున్న రాంబాబు